సాక్షి
కాకినాడ

శుక్రవారం । 27 । సెప్టెంబర్ । 2024



భరోసా ఇచ్చి.. బాధితులను మరచి..

సామాన్య, మధ్యతరగతి ప్రజలకు చెందిన వందలాది కోట్ల రూపాయలు దుర్వినియోగం చేసి బోర్డు తిప్పేసిన జయలక్ష్మి ఎంఏఎం సొసైటీ బాధితులకు భరోసా లేకుండా పోయింది.


8లో



అన్నవరం రైల్వేస్టేషన్‌లో తనిఖీలు

దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ డైరెక్టర్ ఆఫ్ ఆడిట్ (సికింద్రాబాద్) సుహాసిని ఎస్.గోత్మారే గురువారం అన్నవరం రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు.

1.70 లక్షల క్యూసెక్కులు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం సాయంత్రం 1,70,803 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 10.90 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 9,700 క్యూసెక్కుల నీరు వదిలారు.

న్యూస్‌రీల్

పోస్ట్‌మార్టంలో ఆధునిక సాంకేతికత

- త్వరలో అందుబాటులోకి
- డాక్టర్ ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వేమిరెడ్డి రాధికారెడ్డి



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

కాకినాడ క్రైం: మృతదేహాన్ని కోయకుండానే పోస్టుమార్టం నిర్వహించే అధునాతన సాంకేతికత అందుబాటులోకి రానున్నదని డాక్టర్ ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వేమిరెడ్డి రాధికారెడ్డి తెలిపారు. ఆ దిశగా జరుగుతున్న పరిశోధనలు సఫలీకృతం అవుతున్నాయన్నారు. గురువారం కాకినాడలోని రంగరాయ వైద్య కళాశాలలో సౌత్ ఇండియా మెడికో లీగల్ అసోసియేషన్ వార్షిక సదస్సు, సిమ్లా–2024 అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. పొరుగు రాష్ట్రాల నుంచి సుమారు 500 మంది ఫోరెన్సిక్ వైద్య నిపుణులు హాజరయ్యారు. ఆర్గనైజింగ్ చైర్మన్, ఫోరెన్సిక్ హెచ్‌వోడీ డాక్టర్ పి.ఉమామహేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఫణికిరణ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సదస్సుకు విశిష్ట అతిథిగా డీఎంఈ అకడమిక్ డాక్టర్ రఘునందన్ హాజరయ్యారు. వక్తలు మాట్లాడుతూ, ఫోరెన్సిక్ మెడిసిన్ దిశదశ సమూలంగా మారిపోనుందన్నారు. వర్చువల్ పోస్టుమార్టంకు ప్రాధాన్యం పెరుగుతోందని తెలిపారు. దేశ, విదేశాల్లో ఇప్పటికే అధునాతన సాంకేతిక అనుబంధ అటాప్సీ విధానాలు అందుబాటులోకి వచ్చాయని అన్నారు. సాంకేతికతను జోడించి చేసే అటాప్సీలో కచ్చితత్వానికి ఎక్కువ అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎంసీ క్యాంపస్ ఆఫీసర్, ఫోరెన్సిక్ అసిస్టెంట్ ప్రొఫెసర్ సతీష్ సహా ఫోరెన్సిక్ విభాగం బోధనా సిబ్బంది, పీజీలు పాల్గొన్నారు.

జిల్లా రవాణాశాఖాధికారి మోహన్ బదిలీ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జిల్లా రవాణా శాఖాధికారి ఎ.మోహన్ విజయవాడ డీటీసీగా నియమితులై గురువారం రిలీవ్ అయ్యారు. ఈయన స్థానంలో కర్నూలు డీటీసీగా ఉన్న శ్రీధర్ నియమితులయారు. ఈ సందర్భంగా మోహన్‌కు కార్యాలయంలో రవాణాశాఖాధికారులు, కార్యాలయ సిబ్బంది వీడ్కోలు పలికారు. నూతనంగా నియమితులైన శ్రీధర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఎమ్మెల్యే నానాజీ దౌర్జన్యంపై త్వరలో ప్రభుత్వానికి నివేదిక

కాకినాడ సిటీ: కాకినాడ రంగరాయ వైద్య కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ ఉమామహేశ్వరరావుపై రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ దౌర్జన్యం, దాడి సంఘటనపై పౌరహక్కుల సంఘం నిజ నిర్ధారణ కమిటీ బృందం నివేదికను త్వరలో ప్రభుత్వానికి ఇవ్వనున్నట్టు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేడంగి చిట్టిబాబు, ఉపాధ్యక్షుడు నంబూరి శ్రీమన్నారాయణలు గురువారం కాకినాడలో తెలిపారు. ఇప్పటికే ఈ నిర్ధారణ కమిటీ కాకినాడలో పర్యటించి సిబ్బందిని, డాక్టర్ కలిసి వాస్తవాలను సేకరించిందన్నారు. రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, ఆయన అనుచరులు ఆర్‌ఎంసీ మైదానంలో ప్రవేశించి మెడికల్ కాలేజీ స్పోర్ట్స్ వైస్ ప్రెసిడెంట్‌పై దాడి చేసి కొట్టారన్నారు. వాలీబాల్ ఆటకు కళాశాల మైదానం బయట వ్యక్తుల ప్రవేశానికి నిరాకరించినందున డాక్టర్‌ను కొట్టడం తీవ్రంగా పరిగణిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే నానాజీ రాజీనామా చేయాలని, కేసులో ఎస్సీ, ఎస్టీ సెక్షన్లు చేర్చాలని ప్రభుత్వాన్ని కోరనున్నట్టు వారు తెలిపారు.

నిరసన విరమణ

కాకినాడ క్రైం: కొద్ది రోజులుగా కాకినాడ జీజీహెచ్‌లో డిమాండ్లు అమలు చేయాలని కోరుతూ నిరసన బాట పట్టిన కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు తమ నిరసనను విరమిస్తున్నట్లు ప్రకటించారు. అధికారులు ప్రభుత్వం తరఫున చర్చించి సానుకూల అభిప్రాయాన్ని వెల్లడించడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు కాంట్రాక్టు నర్సుల సంఘ నాయకత్వం ఓ ప్రకటనలో వెల్లడించింది. 115 జీవో కోసం సంబంధిత అధికారులకు నోటీసులు అందించి జీవో ప్రొసీడింగ్స్ ఆపారని వెల్లడించారు. జీవో సమస్య కోర్టులో ఉన్న నేపథ్యంలో తిరిగి ఏఎన్ఎంలను వారి స్థానాల్లోనే కొనసాగిస్తున్నారన్నారు. స్టాఫ్ నర్సు పోస్టులు వారితో భర్తీ చేయలేదని వెల్లడించారు. మిగిలిన డిమాండ్లయిన 100 గ్రాస్ శాలరీ, పరస్పర అంగీకార బదిలీలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఐదుగురు స్టాఫ్ నర్సుల నియామకం, నర్సులకు భద్రత, విధి నిర్వహణలో మృతి చెందితే కాంట్రాక్టు స్టాఫ్ నర్సు కుటుంబానికి రూ.50 లక్షల బీమా అంశాలపై ప్రభుత్వంతో చర్చించి అమలుకు చర్యలు చేపడతామన్నారు. నిర్ణీత కాలంలో స్పందించకపోతే ఉద్యమం అనివార్యమవుతుందని సంఘ నాయకులు తెలిపారు.

పేదల విద్యపై పగ

- సర్కారు బడుల్లో సీబీఎస్ఈ సిలబస్‌కు మంగళం
- విద్యాసంవత్సరంలో మూడు నెలలు గడిచాక కూటమి ప్రభుత్వం నిర్ణయం
- జిల్లావ్యాప్తంగా 33 సర్కారు పాఠశాలల్లో 3,574 మంది విద్యార్థులు
- టెన్త్ పరీక్షలు స్టేట్ సిలబస్‌లో రాయాలంటూ ఆదేశాలు
- 430 సబ్జెక్టు టీచర్లకు బోధనపై గత ప్రభుత్వంలో శిక్షణ



సీబీఎస్ఈ సిలబస్‌ను బోధించిన కొండెవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ప్రతి విద్యార్థి జీవితంలో పదో తరగతి కీలకమైన ఘట్టం. టెన్త్‌లో సాధించే మార్కులే భవిష్యత్తులో ఉపయోగపడతాయి. అందువల్లే పదో తరగతిపై ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారు. కానీ నేడు చంద్రబాబునాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ఉన్నట్టుండి సీబీఎస్ఈ సిలబస్ రద్దు చేస్తున్నామంటూ ప్రకటించి వారి భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసింది. విద్యార్థులకు మనమిచ్చే ఆస్తి ఏదైనా ఉందంటే అది చదువు ఒక్కటేనని నమ్మిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తన హయాంలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు చేపట్టారు. సర్కారు పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తే లక్ష్యంగా సకల సదుపాయాలు కల్పించి జాతీయ, అంతర్జాతీయ పోటీ పరీక్షల్లో రాణించేలా బోధన ఉండాలని భావించారు. అందుకే కార్పొరేట్ స్కూళ్లకే పరిమితమైన సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) సిలబస్‌ను ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశపెట్టారు. తొలిదశలో జిల్లాలో ఎంపిక చేసిన 33 ఉన్నత పాఠశాలల్లో 8వ తరగతి నుంచి అమలు చేశారు. తొలి బ్యాచ్ విద్యార్థులు ఈ ఏడాది 10వ తరగతి పరీక్షలకు సీబీఎస్ఈ సిలబస్‌తో సన్నద్ధమవుతున్న తరుణంలో ఇప్పుడు హఠాత్తుగా స్టేట్ సిలబస్‌లో పరీక్షలు రాయాలంటూ కూటమి ప్రభుత్వం నిర్ణయించింది.

జాతీయ స్థాయిలో రాణించేలా...

జాతీయ స్థాయి విద్యా ప్రమాణాలకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు ఖరీదైన సీబీఎస్ఈ బోధనను గత ప్రభుత్వం తీసుకువచ్చింది. ఈ సిలబస్‌లో చదివితే జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో సత్తాచాటే అవకాశం దక్కుతుంది. కనీసం రెండెకరాలకు పైగా విస్తీర్ణం ఉన్న పాఠశాలలను గుర్తించి సీబీఎస్ఈ సిలబస్‌కు గత ప్రభుత్వం ఎంపిక చేసింది.

33 పాఠశాలల్లో అమలు..

కేజీబీవీ, మోడల్ స్కూల్స్, సంక్షేమ వసతి పాఠశాలలతో పాటు జిల్లాలోని తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమాలున్న మరో 10 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్ అమలులోకి తెచ్చారు. అత్యధికంగా తుని మండంలో ఆరు స్కూళ్లు, శంఖవరం మండలంలో మూడు స్కూళ్లలో అమలు చేశారు. జిల్లావ్యాప్తంగా 33 పాఠశాలల్లో 3,574 మంది విద్యార్థులు సీబీఎస్ఈ సిలబస్‌లో చదువుతున్నారు.

గత ప్రభుత్వంలో టీచర్లకు ప్రత్యేక తర్ఫీదు

జిల్లాలో సీబీఎస్ఈ అమలులో ఉన్న స్కూళ్లలో 9, 10 తరగతులకు బోధిస్తున్న ఇంగ్లిష్ టీచర్లు 69 మంది, గణితం–67, ఫిజికల్ సైన్స్ –51, బయలాజికల్ సైన్స్–50, సోషల్ స్టడీస్–50, తెలుగు 52, ఫిజికల్ ఎడ్యుకేషన్, సంస్కృతం తదితర సబ్జెక్టులకు కలిపి మొత్తం 430 మంది సబ్జెక్టు టీచర్లకు శిక్షణ ఇచ్చారు. వీరిని రెండు బ్యాచ్‌లుగా విభజించి ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు.

ప్రైవేట్ విద్యాసంస్థలకు లాభం చేకూర్చేందుకే..

విద్యాసంవత్సరం ప్రారంభమై మూడు నెలలు గడిచాక స్టేట్ సిలబస్‌లో పరీక్షలు రాయాలంటూ కూటమి ప్రభుత్వం చెప్పడంతో అన్ని వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే సీబీఎస్ఈ సిలబస్‌లో యూనిట్ పరీక్షలు రాశారు. ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలకు లాభం చేకూర్చేందుకు చంద్రబాబు నేతృత్వంలో కూటమి సర్కారు సెంట్రల్ సిలబస్ రద్దు చేసిందని మేధావులు అభిప్రాయపడుతున్నారు. సీబీఎస్ఈ సిలబస్‌ను రద్దు చేసి చంద్రబాబు మరోసారి తన నిజ స్వరూపాన్ని ప్రదర్శించారని పేర్కొంటున్నారు.

జిల్లాలో పదో తరగతిలో సీబీఎస్ఈ బోధన అమలు చేసిన పాఠశాలల వివరాలు..

పాఠశాల యాజమాన్యం	సంఖ్య	విద్యార్థులు
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు	13	1,747
ఏపీ మోడల్ స్కూల్స్	02	185
కేజీబీవీ స్కూల్స్	04	277
సాంఘిక సంక్షేమ స్కూల్స్	09	185
ఏపీ స్టేట్ గవర్నమెంట్	02	670
మున్సిపల్	03	510

సీబీఎస్ఈ సిలబస్ ప్రయోజనాలు ఇవీ...

- విద్యార్థికి స్నేహపూర్వకంగా ఉంటుంది. కోర్సు నిర్మాణం ఒత్తిడికి గురిచేయదు. పాఠ్య పుస్తకాలను ఆసక్తిగా, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో రూపొందిస్తారు.
- పోటీ పరీక్షల్లో విద్యార్థులు విజయం సాధించేందుకు దోహదపడుతుంది.
- యాంత్రిక విద్యకు దూరంగా..వాస్తవాలకు దగ్గరగా విద్యను బోధిస్తారు.
- పరీక్షల్లో ఉత్తీర్ణత శాతానికి పెద్దగా ప్రాధాన్యం కల్పించరు.
- ఏ మేరకు సబ్జెక్టును నేర్చుకున్నారన్నది పరీక్షించేలా ప్రశ్నపత్రాలు రూపొందిస్తారు.
- తక్కువ మంది పరీక్షల్లో విఫలమవుతారు.
- ఐఐటీ, ఎయిమ్స్ వంటి సంస్థల్లో భవిష్యత్తు అధ్యయనాలను కొనసాగించాలనుకుంటే సీబీఎస్ఈ పాఠ్యాంశాలు చాలా సహాయపడతాయి.

ప్రత్యేక తరగతులు నిర్వహిస్తాం



ప్రభుత్వం సీబీఎస్ఈ రద్దు చేసిన విషయం వాస్తవమే. సీబీఎస్ఈ సిలబస్ బోధిస్తున్న 33 స్కూళ్లలో 10వ తరగతి విద్యార్థులు 3,574 మందికి స్టేట్ సిలబస్ బోధిస్తాం. వారు స్టేట్‌బోర్డు పరీక్షలకు సన్నద్ధమయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటాం.

– పిల్లి రమేష్, డీఈఓ, కాకినాడ

హిందుత్వం కోసం కాదు.. పవన్ ప్రసన్నం కోసం



ఉదయం శ్రీవారి ఆలయం వద్ద అఖండ దీపంతో అవినాష్ దేవి చంద్ర

ద్వారకాతిరుమల: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం అపవిత్రమైందంటూ కొందరు హిందుత్వాన్ని అడ్డం పెట్టుకుని రాజకీయ స్టంట్లు చేస్తున్నారు. ఒక ట్రస్ట్ ఫౌండర్ చేపట్టిన పాదయాత్ర ఈ కోవకే చెందినదని కొందరు అంటున్నారు. వివరాల్లోకి వెళితే.. శ్రీ తారా వారాహి లోక కల్యాణార్థ సేవా భారత్ ట్రస్ట్ ఫౌండర్ బచ్చు అవినాష్ దేవి చంద్ర కాకినాడ జిల్లా పిఠాపురం నుంచి తిరుమలకు పాదయాత్ర చేస్తున్నట్టు ప్రకటించారు. అందులో భాగంగా ఆయన గురువారం ఉదయం 9.30 గంటల సమయంలో ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయానికి చేరుకున్నారు. శిరస్సుపై ఉన్న అఖండ దీపంతో స్వామివారిని దర్శించుకున్న అనంతరం అవినాష్ దేవి చంద్ర విలేకర్లతో మాట్లాడారు. తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీ కావడంతో మహాపాపం జరిగిందన్నారు. పాపం పోవాలంటే ప్రతి ఒక్కరూ అఖండ దీపం వెలిగించాలని, స్వామి ప్రసాదాన్ని కల్తీ చేసిన దోషులకు శిక్షపడాలని అన్నారు. తన పాదయాత్ర ఏలూరు, హనుమాన్‌జంక్షన్ మీదుగా విజయవాడ దుర్గమ్మ ఆలయానికి చేరుకుంటుందని చెప్పారు. ఇదిలా ఉంటే అవినాష్ దేవి చంద్ర సాయంత్రానికి మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వద్ద దర్శనమిచ్చారు. సోషల్ మీడియాలో కనిపించిన ఈ దృశ్యాలు పలువురిని కంగుతినేలా చేశాయి. మహా పాదయాత్రను పక్కనబెట్టి పవన్ వద్దకు వెళ్లడం ఏమిటని ముక్కున వేలేసుకున్నారు.



సాయంత్రం మంగళగిరి జనసేన కార్యాలయంలో పవన్ కల్యాణ్‌తో అవినాష్ దేవి చంద్ర

వర్జీనియా పొగాకుకు డిమాండ్



రైతులతో మాట్లాడుతున్న బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్

దేవరపల్లి: అంతర్జాతీయ మార్కెట్లో వర్జీనియా పొగాకుకు డిమాండ్ పెరిగిందని పొగాకు బోర్డు చైర్మన్ సీహెచ్ యశ్వంత్‌కుమార్ తెలిపారు. దేవరపల్లి పొగాకు వేలం కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పొగాకు రైతులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ ఏడాది మార్కెట్లో రైతులకు మంచి ధర లభించిందన్నారు. కిలో గరిష్ట ధర రూ.410 పలికిందన్నారు. దీనికి కారణం బ్రెజిల్, జింబాబ్వేలో పొగాకు ఉత్పత్తి గణనీయంగా తగ్గడమే అని తెలిపారు. రాజమహేంద్రవరం రీజియన్ పరిధిలోని తూర్పు, ఏలూరు జిల్లాల్లో గల ఐదు వేలం కేంద్రాల్లో పండించిన ఎన్‌ఎల్ఎస్ (నార్తరన్ లైట్ సాయిల్) పొగాకుకు డిమాండ్ ఎక్కువగా ఉందన్నారు. 2024–25 ఏడాదిలో బ్రెజిల్, జింబాబ్వే దేశాల్లో పంట ఉత్పత్తి గణనీయంగా పెరుగుతుందని తెలిపారు. జింబాబ్వేలో 2.50 లక్షల ఎకరాల్లో పంట సాగు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఎస్‌బీఎస్, ఎస్ఎల్ఎస్ పొగాకు ఉత్పత్తి పెరుగుతుందన్నారు. ఆఫ్రికా దేశాల్లో పండిస్తున్న బర్లీ పొగాకు సాగు ఎక్కువగా ఉందని తెలిపారు. 2024–25 పంట కాలంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 16 వేలం కేంద్రాల పరిధిలో 167 మిలియన్ల కిలోల ఉత్పత్తికి అనుమతి ఇచ్చినట్టు ఆయన తెలిపారు. దీనికి మించి పంట ఉత్పత్తి చేస్తే అదనపు పొగాకు అమ్మకాలపై కేంద్ర ప్రభుత్వం అపరాధ రుసుం వసూలు చేస్తుందన్నారు. ఎన్‌ఎల్ఎస్ ప్రాంతంలో 58.75 మిలియన్ల కిలోల ఉత్పత్తికి అనుమతి ఉందని, బ్యారన్‌కు 41.25 క్వింటాళ్ల ఉత్పతికి అనుమతి ఇచ్చినట్టు ఆయన తెలియజేశారు. తొర్రేడు ప్రాంతంలో పండిస్తున్న బ్లాక్ సాయిల్(బీఎస్) పొగాకు 3.48 మిలియన్ల కిలోల ఉత్పత్తికి అనుమతి ఇచ్చినట్టు చెప్పారు. బ్యారన్‌కు 35.50 క్వింటాళ్ల ఉత్పత్తి చేయాలన్నారు. బర్లీ పొగాకు 200 మిలియన్ల కిలోలు ఉత్పత్తి అవుతుందన్నారు. లోగ్రేడు పొగాకు అమ్మకోవడంలో రైతులు విఫలమయ్యారని తెలిపారు.

ఏలేరు ముంపు బాధితులను ఆదుకోండి

కలెక్టర్‌కు మాజీ ఎంపీ గీత వినతి



కలెక్టర్ షణ్మోహన్‌కు వినతి పత్రం అందజేస్తున్న మాజీ ఎంపీ గీత, ప్రజాప్రతినిధులు

కాకినాడ: ఏలేరు వరద ముంపు కారణంగా నష్టపోయిన రైతులను, ఆయా ప్రాంతాల ప్రజలను అన్ని విధాలా ఆదుకోవాలని కాకినాడ మాజీ ఎంపీ వంగా విశ్వనాథ్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఆమె పిఠాపురం, ఉప్పాడ, గొల్లప్రోలు ప్రాంతాలకు చెందిన స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి కలెక్టర్ షణ్మోహన్‌ను కలసి ఏలేరు వరద ముంపు వల్ల జరిగే నష్టాన్ని వివరిస్తూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారుల అంచనా ప్రకారం దాదాపు 50 శాతం అంటే 17–20 వేల ఎకరాల పంట నష్టం జరిగినట్టు ఇప్పటికే తేలిందన్నారు. పరిహారం పంపిణీ సమయంలో ఎలాంటి పక్షపాత ధోరణి లేకుండా ప్రతీ ఒక్క రైతు, రైతు కూలీ, స్థానిక బాధితులకు పరిహారం అందజేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సుమారు 16–17 చోట్ల గండ్లు పడ్డాయని, వీటన్నింటిని యుద్ధ ప్రాతిపదికన పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. ఈ ప్రక్రియలో జాప్యం జరిగితే రానున్న దాళ్వా పంటకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితులు ఉంటాయన్నారు. రైతులు, ఇరిగేషన్ శాఖల సమన్వయంతో పనులన్నీ వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దాళ్వా వేసే వరకు సుమారు రెండున్నర నెలలపాటు పనులు లేక రైతులు, రైతు కూలీలు, ఇతర చిరు వ్యాపారులు జీవనోపాధి కోల్పోయే పరిస్థితి ఉందని ఆమె కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. వీరిని ఆదుకునేందుకు ఉపాధి హామీ పథకాన్ని వినియోగించాలని, పూడుకుపోయిన కాల్వలను యంత్రాలతో పరిశుభ్రం చేయించాలని కోరారు. పిఠాపురం ఆర్వోబీకి సంబంధించి గత ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.40 కోట్లు, సేతు బంధు పథకం ద్వారా రూ.100 కోట్లు మంజూరు చేయించారని, పనులు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గొల్లప్రోలు జగనన్న కాలనీలో 2.50 కోట్ల అంచనాలతో ప్రతిపాదించిన బిడ్జి నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఆమె కలెక్టర్‌ను కోరారు. జెడ్పీటీసీ సభ్యులు లోవరాజు, తులసికుమార్, ఎంపీపీ అరిగెల రామన్నదొర, పార్టీ నాయకులు గండేపల్లి బాబి, గండేటి రాము, రావుల మాధవరావు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు ఆమె వెంట ఉన్నారు.

నెయ్యి కొనుగోలులో ప్రతిష్టంభన

- ప్రభుత్వ నిర్ణయం కోసం అన్నవరం ఆలయ అధికారుల ఎదురుచూపులు
- ఈ నెలాఖరుతో ముగియనున్న సరఫరా టెండర్
- అక్టోబర్ ఒకటో తేదీ నుంచి మార్చి 31, 2025 వరకు కొత్త టెండర్
- కేజీ రూ.484 రేటుతో లోయెస్ట్–1 గా వినాయక ఎంటర్‌ప్రైజెస్



సత్యదేవుని ప్రసాదం ప్యాకింగ్ ఇలా..



ప్రసాదంలో నెయ్యి కలుపుతున్న దృశ్యం

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో ప్రసాద విభాగంలో ఆవు నెయ్యి కొనుగోలు విషయమై ప్రతిష్టంభన నెలకొంది. ఇప్పటి వరకు ఉన్న పద్ధతి ప్రకారం టెండర్ ద్వారా లోయెస్ట్‌గా వచ్చిన సంస్థ నుంచి కొనుగోలు చేయాలా లేక ప్రభుత్వం కొత్తగా నిర్ణయం తీసుకుంటుందా అనే దానిపై అధికారులు తర్జన భర్జన పడుతున్నారు. ప్రస్తుత నెయ్యి సరఫరా టెండర్ ఈ నెల 30 వరకు మాత్రమే ఉంది. అక్టోబర్ ఒకటో తేదీ నుంచి కొత్త సప్లయ్ దారు నుంచి నెయ్యి కొనుగోలు చేయాల్సి ఉంది.

ఇప్పటికే పూర్తయిన టెండర్ ప్రక్రియ

అన్నవరం దేవస్థానంలో ఆరు నెలలకొకసారి టెండర్ ద్వారా ఆవు నెయ్యి కొనుగోలు చేస్తుంటారు. గతంలో టెండర్ ద్వారా మాత్రమే కొనుగోలు చేయగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక టెండర్‌లో లోయెస్ట్ ఖరారయ్యాక మళ్లీ రివర్స్ టెండర్ ద్వారా ఎవరు తక్కువకు ఇస్తే వారి ద్వారా కొనుగోలు చేసే పద్ధతి ప్రవేశ పెట్టారు. దాని ప్రకారం అక్టోబర్ ఒకటో తేదీ నుంచి 2025, మార్చి 31 వరకు ఆవు నెయ్యి సరఫరాకు ఆగస్టు నెలలో ఈ ప్రొక్యూర్ టెండర్ పిలిచారు. ఆ తరువాత రివర్స్ టెండర్ ద్వారా నెయ్యి సరఫరాకు తిరుపతికి చెందిన వినాయక ఏజెన్సీ కిలో రూ.484కి సరఫరా చేయడానికి కొటేషన్ దాఖలు చేసి ఎల్–1 గా నిలిచింది. కాగా విశాఖపట్నానికి చెందిన విశాఖ డెయిరీ కిలో రూ.488 కి సరఫరా చేయడానికి కోటేషన్ దాఖలు చేసి ఎల్–2 గా నిలిచింది. మామూలు పరిస్థితుల్లో అయితే ఇప్పటికే నెయ్యి సరఫరా టెండర్ ఖరారు చేసేవారు. కాని తిరుమలకు సరఫరా చేస్తున్న నెయ్యి కల్తీ అయిందన్న ఆరోపణలతో నెయ్యి కొనుగోలుపై దేవస్థానం అధికారులు ఏ నిర్ణయం తీసుకోలేదు.

ఏడాదికి రెండు లక్షల కిలోల నెయ్యి కొనుగోలు

అన్నవరం దేవస్థానంలో ప్రసాదం తయారీలో ఏటా సుమారు రెండు లక్షలు కిలోల నెయ్యి ఉపయోగిస్తున్నారు. ప్రతి నెలా సుమారు 12వేల కేజీల నుంచి 20 వేల కేజీల వరకు ఉపయోగిస్తారు. ఆరు నెలలకొకసారి టెండర్ పిలిచి నెయ్యి కొనుగోలు చేస్తుంటారు. గత ఏడాది టెండర్ ద్వారా కిలో నెయ్యి రూ.564కి కొనుగోలు చేశారు. ఏటా నెయ్యి కొనుగోలుకు రూ.ఆరు కోట్ల నుంచి రూ. పది కోట్లు వరకు దేవస్థానం ఖర్చు చేస్తోంది.

నాణ్యతపై రాజీ లేదు

దేవస్థానానికి నెయ్యి సరఫరా టెండర్ దారుడు ప్రభుత్వ నియమ నిబంధనలను అనుసరించి నాణ్యమైన నెయ్యిని సరఫరా చేయాల్సి ఉంటుంది. ఆ మేరకు లాబ్ సర్టిఫికెట్‌లు జత చేయాలని అధికారులు తెలిపారు. దేవస్థానం కూడా విజయవాడలోని ల్యాబ్‌కు పంపించి మళ్లీ టెస్ట్ చేయిస్తుంది. అది నాణ్యమైన నెయ్యి అని తేలితేనే దానిని ప్రసాదంలో ఉపయోగిస్తామని అధికారులు తెలిపారు.

ప్రభుత్వ నిర్ణయం ప్రకారం నెయ్యి కొనుగోలు



ఏటా మాదిరి లోయెస్ట్ కొటేషన్‌ను ఎంపిక చేశాం. ఇంకా వారికి సరఫరా ఆర్డర్ ఇవ్వలేదు. అయితే తిరుపతి నెయ్యి వివాదం వలన ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నాం. టెండర్ ద్వారా కొనుగోలుకు అనుమతిస్తే లోయెస్ట్ సప్లయిదారు నుంచి కొనుగోలు చేస్తాం. ఒకవేళ ప్రభుత్వం ప్రత్యామ్నాయ పద్ధతి ప్రకారం కొనుగోలు చేయాలని ఆదేశిస్తే ఆ మేరకు చర్యలు తీసుకుంటాం.

– కే రామచంద్రమోహన్, ఈఓ, అన్నవరం దేవస్థానం

రూ.4.31 కోట్లతో అభివృద్ధి పనులు

కౌడా సమావేశంలో నిర్ణయం



కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ సమావేశంలో ప్రసంగిస్తున్న వీసీ భావన

కాకినాడ రూరల్: కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కౌడా) ద్వారా జిల్లాలో కాకినాడ నగరంతో పాటు పిఠాపురం, తుని, సామర్లకోటలలో రూ.40.31కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు వైస్ చైర్మన్ భావన ఆధ్వర్యంలో బోర్డు సభ్యులు ఆమోదం తెలిపారు. ఎస్ఎఫ్‌సీఎల్ రోడ్డులోని కౌడా కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం వీసీ భావన అధ్యక్షతన బోర్డు సమావేశం నిర్వహించి మొత్తం తొమ్మిది తీర్మానాలను ఆమోదించారు. బిల్డర్ డెవలప్‌మెంట్ లైసెన్స్ ఫీజు సవరణకు ఆమోదించారు. అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి కాకినాడ నగరంలో ఎంఎస్ఎన్ చారిటీస్‌లో బ్యూటిఫికేషన్‌కు రూ.1.20 కోట్లు, పిఠాపురం పశువుల సంతలో షెడ్లు, ప్రహరీ, నీళ్లకుండీల నిమిత్తం రూ.1.35 కోట్లు, తుని పట్టణంలో శ్మశాన వాటికి అభివృద్ధికి రూ.1.50కోట్లు, సామర్లకోట పట్టణంలో అభివృద్ధి పనులకు రూ.26 లక్షలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు తీర్మానం చేశారు. సమావేశంలో కౌడా కార్యదర్శి కాశీబాబు, సభ్యులుగా డైరెక్టరు ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్, ఏపీఈపీడీసీఎల్, ఆర్ అండ్‌బీ, డీఐసీ, పీసీబీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే సుబ్బరాజు

తాళ్లరేవు: చొల్లంగిపేట జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు పి.మహేష్, పి.పుష్పలత, ఆర్.వీరశ్రావణి రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు స్కూల్ పీడీ నీలిమ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రామచంద్రపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 19న జరిగిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అండర్–19 బేస్‌బాల్ జట్ల ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. వీరు నవంబర్ నెలలో గుంటూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో పాటు వారికి శిక్షణ ఇచ్చిన పీడీ నీలిమను ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, స్కూల్ హెచ్‌ఎం వి.రాజేశ్వరి, హైస్కూల్ పీఎంసీ చైర్మన్ డి.గంగాభవాని, ఉపాధ్యాయులు అభినందించారు.

అత్యాచారం కేసులో నిందితుడికి జైలు

సామర్లకోట: మతిస్థిమితం లేని మహిళను అత్యాచారం చేసిన ఘటనలో ముద్దాయి చింతపల్లి నూకరాజుకు 10 సంవత్సరాల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం 8వ అడిషనల్ జిల్లా సెక్షన్ కోర్టు జడ్జి వై.బెన్నయ్యనాయుడు తీర్పు ఇచ్చారు. ఈ విషయాన్ని సామర్లకోట సీఐ ఎ.కృష్ణభగవాన్ గురువారం సాయంత్రం విలేకర్లకు తెలిపారు. వివరాల్లోకి వెళితే... 2019లో మతిస్థిమితం లేని మహిళను ఇంట్లో ఎవరూ లేని సమయంలో ముద్దాయి అత్యాచారం చేశాడు. దాంతో బాధితురాలి మేనత్త కుమారుడు ఎం.తరుణ్‌కుమార్ అప్పటి ఎస్సై ఎంవీవీ రవీంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అప్పటి సీఐ వి.శ్రీనివాసు కేసు దర్యాప్తు చేసి నూకరాజును అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. నేరం రుజువు కావడంతో జడ్జి పైవిధంగా తీర్పు ఇచ్చారు. కోర్టులో పీపీ మారిశెట్టి వెంకటేశ్వరరావు ఫిర్యాదుదారు తరపున వాదనలు వినిపించారు. కోర్టు ట్రయిల్ సమయంలో ప్రతిభ కనబర్చిన హెచ్‌సీ బీఎస్ రాజును జిల్లా ఎస్పీ అభినందించారని సీఐ కృష్ణభగవన్ తెలిపారు.

భరోసా ఇచ్చి.. బాధితులను మరచి..

- జయలక్ష్మి సొసైటీ బాధితులను పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- ఎన్నికలకు ముందు భరోసా, సానుభూతి ప్రకటనలు
- సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులను కలసి న్యాయం చేయాలని కోరిన పాలకవర్గం
- రూ.520 కోట్ల డిపాజిట్లపై లోపించిన జవాబుదారీతనం
- గత ప్రభుత్వంలో సిట్ ఏర్పాటు, సీఐడీ విచారణ, నిందితుల అరెస్టు
- నేడు కాకినాడలో తృతీయ మహాజన సభ



సర్పవరం జంక్షన్‌లో జయలక్ష్మి ఎంఏఎం సొసైటీ మెయిన్ బ్రాంచ్ వద్ద బాధితుల అర్ధనగ్న ప్రదర్శన (ఫైల్)



జయలక్ష్మి సొసైటీ మెయిన్ బ్రాంచ్‌లో మూడో మహాజన సభ గురించి సమీక్షిస్తున్న నూతన పాలకవర్గ చైర్మన్ త్రినాథరావు, డైరెక్టర్లు

కాకినాడ రూరల్: సామాన్య, మధ్యతరగతి ప్రజలకు చెందిన వందలాది కోట్ల రూపాయలు దుర్వినియోగం చేసి బోర్డు తిప్పేసిన జయలక్ష్మి ఎంఏఎం సొసైటీ బాధితులకు భరోసా లేకుండా పోయింది. తమ సొమ్ములు ఎప్పుడు వస్తాయో తెలియని బాధితులు రోజులు లెక్కపెడుతూ కాలం గడుపుతున్నారు. సుమారు రూ.20 వేల మంది సభ్యుల నమ్మకాన్ని వమ్ము చేస్తూ 2022 మార్చి 31న జయలక్ష్మి సొసైటీ బోర్డు తిప్పేసింది. వడ్డీ సొమ్ముతో శేష జీవనం గడపవచ్చని కొందరు, పిల్లల భవిష్యత్తు కోసం మరి కొందరు, అధిక వడ్డీలకు ఆశపడి మరి కొందరూ ఇలా రూ.520 కోట్ల మేర జయలక్ష్మి సొసైటీకి చెందిన రాష్ట్రంలోని 6 జిల్లాల పరిధిలోని 29 బ్రాంచుల్లో గతంలో సొమ్ములు డిపాజిట్ చేశారు. వారందరికీ గత పాలకవర్గం షాక్ ఇస్తూ బోర్డు తిప్పేడంతో నేటికి పైసా కూడా దక్కలేదు. ఎన్నికలకు ముందు జయలక్ష్మి బాధితులకు న్యాయం చేస్తామని భరోసా ఇచ్చిన కూటమి నేతలు అధికారంలో వచ్చి 100 రోజులు గడిచినా పట్టించుకున్న దాఖలాలు లేవు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్ తదితరుల చుట్టూ నూతన పాలకవర్గం ప్రదర్శనలు చేస్తూ తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నా ఇప్పటికీ చలనం లేదు.

వసూళ్లు కేవలం రూ.4.86 కోట్లు మాత్రమే..

జయలక్ష్మి సొసైటీ సొసైటీ సభ్యులను నట్టేట ముంచి బోర్డు తిప్పేయడంతో 2022 అక్టోబర్ 3న మహాజన సభ ద్వారా నూతన పాలకవర్గం బాధ్యతలు చేపట్టింది. గంగిరెడ్డి త్రినాథరావు చైర్మన్‌గా, పీవీ రమణమూర్తి వైస్ చైర్మన్‌గా, ఏవీఎస్ రవికుమార్ కోశాధికారిగా, మరో ఏడుగురు డైరెక్టర్లుగా పగ్గాలు చేపట్టారు. వీరంతా వసూళ్ల కోసం పట్టువదలని విక్రమార్కుల్లా ప్రయత్నాలు చేస్తున్నా రుణాలు తీసుకున్న వారి నుంచి చలనం లేదు. సుమారు రూ.580 కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. కేవలం రూ.4.86 కోట్లు మత్రమే నగదు రూపంలో ఉంది. మరో రూ.6 కోట్లు ఆస్తులు సీజ్ చేయడంతో జమ అయిన సొమ్ములు ఉన్నాయి. రెండూ కలిపితే రూ.10 కోట్లు వరకూ మాత్రమే ఉండడంతో సభ్యులకు ఏ విధంగా ఇవ్వాలో తెలియని పరిస్థితి నెలకొంది.

బాధితులకు అండగా గత ప్రభుత్వం

సర్పవరం జంక్షన్ వద్ద ప్రధాన బ్రాంచ్‌తో పాటు 29 బ్రాంచీలు కలిసి బోర్డు తిప్పేసిన జయలక్ష్మి సొసైటీ గత పాలకవర్గం పట్ల గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కఠినంగా వ్యవహరించి బాధితులకు అండగా నిలిచింది. జయలక్ష్మి ఏఏంఏ సొసైటీ అప్పటి చైర్మన్ రాయవరపు సీతారామాంజనేయులు, వైస్ చైర్‌పర్సన్ బద్రి విశాలాక్షి తదితరులను అరెస్టు చేసి జైలుకు పంపింది. జయలక్ష్మి వ్యవహారంపై మాజీ సీఎం జగన్ సిట్ ఏర్పాటు చేసి విచారణ జరిపించారు. సిట్ నివేదికలో డిపాజిటర్ల సొమ్ములు దుర్వినియోగం, రుణ గ్రహీతల వివరాలు పొందుపరిచి ప్రభుత్వానికి నివేదించడంతో సీఐడీ విచారణకు ఆదేశించింది. సీఐడీ అధికారులు 84 కేసుల్లో రూ.300 కోట్ల మేర ఆస్తులకు చార్జ్‌షీట్ దాఖలు చేశారు. మరో 110 కేసుల్లో రూ.200 కోట్ల మేర ఆస్తుల సీజ్‌కు నివేదించగా ఇందుకు సంబంధించి జీఓ నేటికీ ప్రస్తుత హోం మంత్రి వద్ద పెండింగ్‌లో ఉంది. సిట్ నివేదిక ఆధారంగా నూతన పాలకవర్గం డిస్ప్యూట్ సెటిల్‌మెంట్ కమిటీని ఏర్పాటు చేసి 465 కేసులకు రూ.497 కోట్లకు ఒక కేసుగా సివిల్ కోర్టులోనూ, వాటిలోనే మరో 190 కేసులను కో ఆపరేటివ్ ట్రిబ్యునల్‌లో వేశారు.

మొండి బకాయిలపై కఠినంగా వ్యవహరించాలి

జయలక్ష్మి సొసైటీ ద్వారా అందించిన రుణాల్లో రూ.123 కోట్లు మాత్రమే సెక్యూర్డ్ రుణాలు అన్‌సెక్యూర్డ్‌గా ఉన్నాయి. కొన్ని రుణాలకు డాక్యుమెంట్లు లేవు. బినామీల పేరిట కొల్లగొట్టారు. అన్‌సెక్యూర్డ్ లోన్లు సుమారు 400గా గుర్తించగా 365 మంది వ్యక్తులు ఉన్నారు. అన్‌సెక్యూర్డ్ రుణాలను ఎక్కువ మొత్తంలో గత పాలవర్గ చైర్మన్, వైస్ చైర్మన్, వారి కుమారుడు కలిసి దుర్వినియోగం చేసినట్టు అప్పట్లో ప్రాథమికంగా గుర్తించారు.

నేడు మూడో మహాజన సభ

జయలక్ష్మి సొసైటీ నూతన పాలకవర్గం ఆధ్వర్యంలో 3వ మహాజన సభను శుక్రవారం కాకినాడలోని దంటు కళాక్షేత్రంలో ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమయ్యే ఈ సభలో సభ్యులు పాల్గొని పలు తీర్మానాలు చేయనున్నారు. చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు ఐదేళ్లకు గత సభలో తీర్మానం చేశారు. ఇప్పటికే రెండేళ్ల పదవీ కాలం ముగియనున్న డైరెక్టర్ల పదవీ కాలం పొడిగింపు, నూతన కార్యవర్గం ద్వారా సొసైటీ కార్యకలాపాల పురోగతిపై చర్చించనున్నారు.

కాళ్లు అరిగేలా తిరుగుతున్నాను



మా మనవడి యూఎస్ చదువుల కోసం కుమార్తె స్థలం విక్రయించడం ద్వారా వచ్చిన సొమ్ములు, నేను కష్ట పడిన సొమ్ములు కలిపి రూ.కోటి డిపాజిట్ చేశాను. జయలక్ష్మి సొసైటీ గత పాలకవర్గం నిండా ముంచింది. సొమ్ములు ఎప్పుడు వస్తాయో తెలియని దుస్థితి. ప్రభుత్వం చొరవ చూపించి బాధితులను ఆదుకోవాలి.

–జి.జానకి, జయలక్ష్మి సొసైటీ బాధితురాలు, కాకినాడ

బాధితులకు అండగా ఉంటాం



జయలక్ష్మి సొసైటీ బాధితులకు అండగా ఉంటాం. మొండి బకాయిల వసూళ్లకు న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నాం. ఆస్తులు విక్రయానికి అనుమతులు వస్తాయని ఎదురు చూస్తున్నాం. జయలక్ష్మి సొసైటీ బాధితుల దుస్థితిని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లాం. వారు సత్వరమే స్పందించి న్యాయం చేసేలా చొరవ తీసుకుంటారని ఆశిస్తున్నాం.

– గంగిరెడ్డి త్రినాథరావు, జయలక్ష్మి సొసైటీ నూతన పాలకవర్గ అధ్యక్షుడు

లడ్డూ పేరుతో ఆటలాడొద్దు

- సీబీఐ విచారణతో నిగ్గు తేల్చండి
- జగన్‌ను నిందించడానికే ఆరోపణలు
- కాకినాడ మాజీ ఎంపీ వంగా గీత



కాకినాడ: ప్రపంచ ప్రసిద్ధి చెందిన తిరుపతి వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదం విషయంలో ఆటలు ఆడవద్దని కాకినాడ మాజీ ఎంపీ వంగా గీత విశ్వనాథ్ హితవు పలికారు. నిజాలు నిగ్గుతేల్చాలంటే సీబీఐతోగానీ, సిటింగ్ జడ్జితో కానీ విచారణ జరిపించాలని ఆమె డిమాండ్ చేశారు. ఆమె కాకినాడ కలెక్టరేట్‌లో గురువారం విలేకరులతో మాట్లాడుతూ సరైన సాక్ష్యాధారాలు లేకుండా లడ్డూ అంశాన్ని వివాదాస్పదం చేస్తున్న తీరు వల్ల ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తులకు తీవ్ర ఆందోళన కలిగించడమే కాకుండా తప్పుడు సంకేతాలు పంపిస్తున్నారని పేర్కొన్నారు. ఆలయ నిర్వహణను ప్రత్యేక బోర్డు, కమిటీలు పర్యవేక్షిస్తాయన్నారు. రాజకీయంగా మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై నిందలు వేసేందుకే ఈ అంశంపై రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. తప్పు జరిగి ఉంటే శిక్ష పడాల్సిందేనని మాజీ సీఎం జగన్ కూడా తన వైఖరి స్పష్టం చేసినందున నిజానిజాలు నిగ్గుతేల్చేందుకు ప్రభుత్వం సిద్ధం కావాలని ఆమె కోరారు. మొక్కుబడి తంతుగా కాకుండా ఉండాలంటే సీబీఐ లేదా సిటింగ్ జడ్జితో విచారణ చేయించడం అవసరమన్నారు. ఎంతో భక్తిభావం కలిగి మానవ సేవే మాధవసేవగా భావించే మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తిరుపతి వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. అటువంటి జగన్ అత్యంత పవిత్రంగా భావించే లడ్డూను ఎందుకు అపవిత్రం చేసేలా పనిచేస్తారని ప్రశ్నించారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ అధికారంలో ఉన్న మూడు పార్టీల కూటమి ప్రభుత్వం వాస్తవాలను నిగ్గుతేల్చేందుకు సిట్ విచారణ కాకుండా సీబీఐ లేదా సిటింగ్ జడ్జితో విచారణకు ముందుకు రావాలని ఆమె కోరారు.

అన్నవరం రైల్వేస్టేషన్‌లో తనిఖీలు



అన్నవరం రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న రైల్వే ప్రిన్సిపల్ డైరెక్టర్ ఆఫ్ ఆడిట్ సుహాసినీ ఎస్ గోత్మారే

అన్నవరం: దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ డైరెక్టర్ ఆఫ్ ఆడిట్ (సికింద్రాబాద్) సుహాసిని ఎస్.గోత్మారే గురువారం అన్నవరం రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. టాయ్‌లెట్స్ వద్ద విద్యుత్ దీపాలు, ప్లాట్ ఫాంపై ప్రయాణికులు కూర్చునే చోట ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. బుకింగ్ కౌంటర్, రైల్వే క్యాంటీన్‌లో ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. తొలుత ఆమె రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద ఆమెకు పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు ఆమెకు వేదాశీస్సులు అందజేయగా సత్యదేవుని ప్రసాదాలను రిసెప్షన్ సూపరింటెండెంట్ కంచి మూర్తి అందజేశారు. ఆమె వెంట అన్నవరం రైల్వే స్టేషన్ మాస్టర్ సతీష్, టీటీలు మోహనరావు, ప్రసాద్, జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ శ్యాం త్రినాథరావు తదితరులు ఉన్నారు.

డ్వాక్రా సొమ్ము రూ.15 లక్షల స్వాహా

- కస్టమర్ పాయింట్ నిర్వాహకురాలి చేతి వాటం
- బ్యాంకు మేనేజర్ పరిశీలనలో బయటపడ్డ నిజం

అంబాజీపేట: ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు మంజూరు చేసిన రుణాలను గ్రూపు సభ్యులు తిరిగి చెల్లించే విషయంలో బ్యాంకు అధీకృత కస్టమర్ పాయింట్ నిర్వాహకురాలు చేతివాటం ప్రదర్శించి రూ.15 లక్షలు స్వాహా చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుల వివరాల ప్రకారం...పుల్లేటికుర్రు యూనియన్ బ్యాంక్ కస్టమర్ పాయింట్ నెలకొల్పేందుకు గాను ఇంటిగ్రా కంపెనీకి అనుమతి ఇచ్చింది. ఈ కస్టమర్ పాయింట్‌లో బ్యాంకు పరిధిలో ఉన్న తొమ్మిది డ్వాక్రా సంఘాల సభ్యులు తాము తీసుకున్న రుణాలను వాయిదాల రూపంలో ప్రతి నెలా నిర్వాహకురాలు పి.మణికి చెల్లిస్తున్నారు. ఆమె వాయిదాలను బ్యాంకుకు సక్రమంగా చెల్లించకపోవడంతో సొమ్ములు స్వాహా అయినట్టు ఆలస్యంగా గుర్తించారు. ఎవరికీ అనుమానం రాకుండా నిర్వాహకురాలు వాయిదా మొత్తాలను రెండు మూడు నెలలకు ఒకసారి ఒక్కొక్క గ్రూపు పేరున బ్యాంకులో జమ చేస్తూ అందరినీ నమ్మించింది. కొంతమంది మహిళా గ్రూపు సభ్యులు తమకు అదనపు రుణ మొత్తం కావాలని బ్యాంకు మేనేజర్ కె.సిద్ధార్థను సంప్రదించగా సదరు గ్రూపు మహిళలు రుణ మొత్తాలను చెల్లించలేదనే విషయం బయటపడింది. తాము కస్టమర్ పాయింట్ నిర్వాహకురాలికి చెల్లించామని మహిళలు బ్యాంకు మేనేజర్‌కు తెలపడంతో ఇదే విషయాన్ని మేనేజర్ ఇంటిగ్రా కంపెనీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఇంటిగ్రా కంపెనీ క్లస్టర్ హెడ్ రఘుచంద్రన్ పుల్లేటికుర్రు చేరుకొని బాధిత మహిళల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. పూర్తి సమాచారం సేకరించాక ఎంత మొత్తం నిధులు స్వాహా అయ్యాయో ధ్రువీకరించుకుని అంబాజీపేట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తామన్నారు. దీనిపై బ్యాంకు మేనేజర్ సిద్ధార్థ మాట్లాడుతూ తాను ఇక్కడికి వచ్చి కేవలం మూడు నెలలు మాత్రమే అయ్యిందన్నారు. అయినప్పటికీ డ్వాక్రా మహిళల సొమ్ములు స్వాహా అయినట్టు గుర్తించామని, మరిన్ని వివరాలు సేకరించి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని తెలిపారు.

గోదావరిలో మృతదేహం గుర్తింపు



నాయుడు సుబ్రహ్మణ్యం (ఫైల్)

కొవ్వూరు: మండలంలోని మద్దూరులంక గోదావరి బ్యారేజి గేట్ల వద్ద నాయుడు సుబ్రహ్మణ్యం (33) అనే యువకుడి మృతదేహాన్ని బుధవారం రాత్రి కొవ్వూరు రూరల్ పోలీసులు గుర్తించారు. ఆ యువకుడు ఈ నెల 24న రోడ్డు కం రైలు వంతెనపై నుంచి గోదావరి నదిలోకి దూకి గల్లంతయ్యాడు. మోటార్ సైకిల్‌పై వచ్చిన సుబ్రహ్మణ్యం వంతెన 127 పిల్లర్ వద్ద బైక్‌ను విడిచి పెట్టారు. మోటారు సైకిల్‌పై 'జై గ్రంధి సిద్ధం' అనే స్టిక్కర్ అతికించి ఉంది. బైక్ నంబర్ ప్లేట్ ఆధారంగా గల్లంతైన వ్యక్తి భీమవరానికి చెందిన వాడిగా అప్పట్లో కొవ్వూరు పట్టణ పోలీసులు గుర్తించారు. విచారణ అనంతరం మృతుడు భీమవరంలోని మోటుపల్లివారి వీధికి చెందిన కార్పెంటర్ నాయుడు సుబ్రహ్మణ్యంగా రూరల్ పోలీసులు గురువారం తెలిపారు. సుబ్రహ్మణ్యానికి భార్యతో పాటు సత్యజ్యోతి, జగదీశ్వరి అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మండపేట మండలం ఏడిద గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం కొంతకాలంగా భీమవరంలో ఉంటున్నాడు. వైఎస్సార్ సీపీలో చురుకైన కార్యకర్త అని చెబుతున్నారు. తల్లిదండ్రులను చూసేందుకు ఏడిద వెళ్లిన సుబ్రహ్మణ్యం తిరిగి బైక్‌పై భీమవరం వెళుతూ మార్గమధ్యలో ఈ అఘాయిత్యానికి పూనుకున్నట్టు భావిస్తున్నారు. మృతుడి తండ్రి నాయుడు వీరభద్రం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు రూరల్ హెడ్ కానిస్టేబుల్ బి.సత్యనారాయణ తెలిపారు.

మాధవరాయుడుపాలెంలో అగ్నిప్రమాదం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కడియం: మండలంలోని మాధవరాయుడుపాలెంలో గురువారం సాయంత్రం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. గ్రామంలోని ఓం శాంతి ఆలయం సమీపంలో జరిగిన ఈ ప్రమాదంలో అన్నందేవుల వీరబాబు ఇంటి వద్ద నిర్వహిస్తున్న కిరాణా జనరల్ స్టోర్, టీ షాపు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఇల్లు, షాపు ఒకే చోట ఉండడంతో భారీ ఆస్తినష్టం జరిగింది. పంచాయతీ సర్పంచ్ అన్నందేవుల చంటి, స్థానికులు మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. స్థానికుల సమాచారం మేరకు రాజమహేంద్రవరం అగ్నిమాపక అధికారి శ్రీనివాస్ నేతృత్వంలో అగ్నిమాపక సిబ్బంది వెంటనే అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు. విద్యుత్ షార్టు సర్క్యూట్ వలన ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని అగ్నిమాపక అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో రూ.4 లక్షల వరకూ ఆస్తినష్టం జరిగినట్టు అంచనా.

బాలికపై అత్యాచారం చేసిన యువకుడి అరెస్టు

మండపేట: మైనర్ బాలికను వేధించడమే కాకుండా అత్యాచారానికి పాల్పడిన యువకుడిని గురువారం రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. రూరల్ సీఐ పీతల దొరరాజు తెలిపిన కథనం ప్రకారం... మండలంలోని ద్వారపూడి శివారు వేములపల్లికి చెందిన ఓ మైనర్ బాలికను రాజానగరం మండలం తుంగపాడుకు చెందిన లోశెట్టి సతీష్ గత ఆరు నెలలుగా వేధిస్తూ ఆమెపై అత్యాచారానికి ఒడిగట్టాడు. దీనిపై బాలిక తల్లిదండ్రులు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్టు సీఐ పీతల దొరరాజు తెలిపారు. రూరల్ ఎస్‌ఐ సురేష్‌బాబు తన సిబ్బందితో దర్యాప్తు వేగవంతం చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని ఆలమూరు కోర్టుకు తరలించగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్టు సీఐ దొరరాజు తెలిపారు. కేసులో కీలకపాత్ర పోషించిన సీఐ, ఎస్‌ఐలతో పాటు సిబ్బంది జి.సత్యనారాయణ, గంగరాజు, రమేష్‌లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

భార్యను వేధించిన భర్తకు జైలు

రౌతులపూడి: భార్యను వేధించిన భర్తకు కోర్టు నాలుగేళ్ల జైలు శిక్ష విధించింది. వివరాల్లోకి వెళితే... మండలంలోని బీబీపట్నం గ్రామానికి చెందిన జిగిరెడ్డి అక్కన్న పాత్రుడు గిడజాం గ్రామానికి చెందిన యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. భార్యను మానసికంగా, శారీరకంగా వేధించడంతో ఆమె 2022లో అన్నవరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి అన్నవరం అడిషనల్ ఎస్‌ఐ బి.అజయ్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితుడిని రాజమహేంద్రవరం జిల్లా ఎస్సీ, ఎస్టీ స్పెషల్ కోర్టులో హాజరు పరిచారు. విచారణలో నేరం రుజువు కావడంతో ముద్దాయికి నాలుగేళ్ల జైలుశిక్షతో పాటు రూ.1000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఆర్.శ్రీలత గురువారం తీర్పు చెప్పారు.

ముగిసిన సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్

- 354 మంది మహిళలకు పరీక్షలు
- 44 మందికి తొలగిన ప్రాణాపాయం



పింక్ ఎన్‌జీవో బృందంతో జీజీహెచ్ యాజమాన్యం

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో గత మూడు రోజులుగా జరుగుతున్న సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ గురువారంతో ముగిసింది. ఈ స్క్రీనింగ్‌లో 354 మంది మహిళలు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 44 మందిలో సర్వైకల్ క్యాన్సర్ వచ్చే ముప్పును ముందుగానే గుర్తించారు. దీంతో వారికి ప్రాణాపాయం తప్పింది. గుర్తించిన మహిళల్లో 40 మందికి థర్మో కోయగ్లేషన్ ద్వారా, ఇద్దరికి లీప్ ద్వారా చికిత్స నిర్వహించి అక్కడికక్కడే ప్రీ క్యాన్సరస్ లీజన్స్ తొలగించి ప్రాణాపాయం నుంచి రక్షించారు. ఆర్‌ఎంసీ గైనకాలజీ, అంకాలజీ సంయుక్త ఆధ్వర్యంలో అమెరికాకు చెందిన పింక్ ఎన్‌జీవో బృందం ఈ స్క్రీనింగ్ పరీక్షలు చేసింది. మహిళలకు పరీక్షలు చేసిన డాక్టర్ సమత, విదేశీ బృందాన్ని జీజీహెచ్ యాజమాన్యం ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, అంకాలజీ హెచ్‌వోడీ వాసన్, గైనికాలజీ హెచ్‌వోడీ అనురాగమయి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడాస్ఫూర్తిని అలవర్చుకోవాలి

- విద్యాశాఖ ఏడీ నాగేశ్వరరావు
- ఉత్సాహంగా పాఠశాల క్రీడా సమాఖ్య ఎంపికలు
- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి 1800 మంది హాజరు



ఆర్చరీ విభాగంలో పోటీ పడుతున్న క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): విద్యార్థులు క్రీడాస్ఫూర్తిని అలవర్చుకుని క్రీడల్లో రాణించాలని విద్యాశాఖ ఏడీ నాగేశ్వరరావు సూచించారు. కాకినాడలోని జిల్లా క్రీడా మైదానంలో గురువారం జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఎస్‌జీఎఫ్‌ఐ జిల్లాస్థాయి అండర్–14, 17 క్రీడాకారుల ఎంపికలు జరిగాయి. ఈ సందర్భంగా ఏడీ నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఎస్‌జీఎఫ్‌ఐ క్రీడలు దోహద పడతాయన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో జరిగే ఎంపికలకు నాలుగు జిల్లాల నుంచి క్రీడాకారులు రావడం అభినందనీయమన్నారు. పాఠశాల క్రీడాసమాఖ్య కార్యదర్శి ఎల్.జార్జి మాట్లాడుతూ ఏడు క్రీడాంశాల్లో 1800 మంది క్రీడాకారులు ఎంపికలకు హాజరయ్యారన్నారు. డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ ఎస్‌జీఎఫ్‌ఐ ఎంపికలు జిల్లా క్రీడామైదానంలో జరగడం సంతోషంగా ఉందన్నారు. క్రీడలు మానసికోల్లాసానికి దోహద పడతాయన్నారు. అనంతరం ఏడీ నాగేశ్వరరావును ఎస్‌జీఎఫ్‌ఐ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ పోటీలకు హాకీ, బాస్కెట్‌బాల్, స్విమ్మింగ్, రైఫిల్ షూటింగ్, తైక్వాండో, హ్యాండ్‌బాల్, ఆర్చరీ, టెన్నికాయిట్ క్రీడాకారులు 1800 మంది హాజరయ్యారు. కార్యక్రమంలో పీఈటీ సంఘ అధ్యక్షుడు రవిరాజు, కార్యదర్శి నూకరాజు, ట్రెజరర్ రవి సందర్‌కార్, తూర్పుగోదావరి జిల్లా ఎస్‌జీఎఫ్‌ఐ కార్యదర్శి స్వామి, కె.పరశురాం, శ్రీనివాస్, వర్మ, డీఎస్‌ఏ కోచ్ సమీర్, జిల్లా తైక్వాండో సంఘ కార్యదర్శి బి.అర్జునరావు, పీడీ నాగమణి తదితరులు పాల్గొన్నారు.



రైఫిల్ షూటింగ్ విభాగంలో పోటీ పడుతున్న క్రీడాకారులు